క్లుప్తంగా

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

జంగారెడ్డిగూడెం: జనవిజ్ఞాన వేదిక చెకుముకి పోటీలో జంగారెడ్డిగూడెం విద్యార్థులు ప్రతిభ చాటారు. శనివారం ఏలూరులో జరిగిన పోటీలో పాల్గొన్న తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు ప్రతిభ పాఠశాల ప్రిన్సిపాల్ కాసర సరోజారెడ్డి తెలిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఎం హితేష్ రిత్విక్, డింపుల్ సాయి సహస్ర, పిలకా దుర్గా శ్రీ ప్రథమ స్థానంలో నిలిచారని వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అకడమిక్ డైరెక్టర్ సుభాష్ రెడ్డి అభినందించారు.

సాయం చేయడంలోనే సంతృప్తి



పొంగుటూరులో పేదలకు సాయం అందిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: నిరుపేదలకు సాయం అందించడంలో సంతృప్తి ఉంటుందని స్పందన ఆర్గనైజేషన్, డైరెక్టర్ కొడమంచిలి జితేంద్ర కుమార్ పేర్కొన్నారు. పొంగుటూరులో మాటూరు ఫంక్షన్ హాల్ వద్ద మంగళవారం స్పందన ఆర్గనైజేషన్ సెక్రటరీ కొడమంచిలి మణమ్మ అధ్యక్షతన నిరుపేదలు, వికలాంగులకు బియ్యం, నిత్యావసర వస్తువులు, అనాథ చిన్నారులకు బ్యాగులు, పుస్తకాలు, డ్రై ఫ్రూట్స్, వితంతువులకు నిత్యావసర సరుకులను అందజేశామని జితేంద్ర కుమార్ తెలిపారు. కార్యక్రమంలో స్పందన స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు, పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



సంతోష్ మృతదేహం

కుక్కునూరు: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి ఘటన మంగళవారం మండలంలోని సీతారామనగరం గ్రామంలో జరిగింది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. సీతారామనగరానికి చెందిన బొల్ల సంతోష్ (27) స్థానికంగా వ్యవసాయం చేస్తుంటాడు. సంతోష్ మంగళవారం ఉదయం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన అచేతన స్థితిలో ఉండడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ మహిళ కుటుంబ సభ్యులే కారణమంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఎస్సై ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలించారు. పురుగుమందు వాసన వస్తుండటంతో సంతోష్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. యువకుని మృతిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విత్తన అంగీకార పత్రాలు తప్పనిసరి

జంగారెడ్డిగూడెం: విత్తన మొక్కజొన్న పంటకు సంబంధించి తప్పనిసరిగా విత్తన అంగీకార పత్రాలను రైతులకు పంటకు ముందుగా అందజేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుజ్జి బాబు అన్నారు. విత్తన ఆర్గనైజర్లకు మంగళవారం జంగారెడ్డిగూడెంలో ఏర్పాటుచేసిన సమావేశంలో బుజ్జిబాబు మాట్లాడారు. జంగారెడ్డిగూడెం, కేఆర్‌పురం డివిజన్‌లోని జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉన్న రైతులందరూ విత్తన మొక్కజొన్న పంటల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమస్యలు తలెత్తితే పంట భూమిపై ఉండంగానే వ్యవసాయ శాఖ వారికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ అధికారి కేవీఎస్ పోశారావు, కేఆర్‌పురం డివిజన్‌లోని విత్తన ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

బలమైన సంఘం కొణిజర్ల ఆర్‌సీఎం

లింగపాలెం: కొణిజర్ల ఆర్‌సీఎం బలమైన సంఘంగా గుర్తింపు పొందిందని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ పి.బాలా అన్నారు. బాలగురు పట్టాభిషేక మహోత్సవం, కొణిజర్ల ఆర్‌సీఎం చర్చ్ సిల్వర్ జూబ్లీవేడుకలు, ఫాదర్ మోజస్ పుట్టినరోజు కార్యక్రమం మంగళవారం కొణిజర్ల ఆర్‌సీఎం చర్చిలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాలా మాట్లాడుతూ కొణిజర్లలో 25 ఏళ్ల కిందట పనిచేసినప్పుడు దివంగత పీఠాధిపతి మొలగడ జాన్, దాతలు సహకారాలతో ఆర్‌సీఎం ఆలయం నిర్మించడం తాను ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. కొణిజర్ల గ్రామస్తులు, సంఘస్తులు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలు మరువలేనని అన్నారు. అనంతరం వేగవరం ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ మోజెస్‌ను సత్కరించారు. తొలుత బాలా నూతన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

కానరాని దీపావళి సందడి

- ఊపందుకోని బాణసంచా వ్యాపారాలు
- పెరిగిన నిత్యావసరాల ధరలు



జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: దీపావళికి టపాసులు కాల్చడం అంటే ప్రజలు ఎంతో మక్కువ చూపిస్తారు. చిన్నారులకు ఎంతో ఆనందాన్ని పంచే పండుగ దీపావళి. అటువంటి పండుగ ప్రస్తుతం వెలవెలబోయే పరిస్థితి నెలకొంది. నిత్యావసరాలు, నూనెలు, కూరగాయల ధరలు పెరగడంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల తుఫాన్లు, అధిక వర్షాలు నేపథ్యంలో ఎక్కడికక్కడ పంటలు దెబ్బతిన్నాయి. చాలా మందికి ఉపాధి కూడా కరువైంది. దీంతో ధరలకు రెక్కలు వచ్చాయి. ఇటువంటి సమయంలో దీపావళి కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో బాణసంచా దుకాణాల వద్ద ప్రజల హడావుడి కనిపించడంలేదు. వ్యాపారం ఊపందుకోలేదు.

వ్యాపారుల్లో నిరాశ

బాణసంచా దుకాణాలు వినియోగదారులు లేక వెలవెలబోతున్నాయి. ఎంతో పెట్టుబడి పెట్టి దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యాపారులకు నిరాశ ఎదురైంది. గతేడాది ధరలే ఇంచుమించుగా ఇప్పుడూ ఉన్నాయి. అయినా విక్రయాలు గతేడాది కన్నా తక్కువగా ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. బుధవారం, గురువారాల్లోనైనా విక్రయాలు పెరుగుతాయనే ఆశాభావం వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



చింతలపూడి : పిల్లలు, పెద్దలు ఎంతో ఆనందంగా నిర్వహించే పండగ దీపావళి. దీపావళి అనగానే అందరికీ గుర్తొచ్చేది హోరెత్తించే టపాసులు, రంగు రంగుల వెలుగులు విరజిమ్మే దీపాలు. పండగ పూట టపాకాయలు కాల్చడంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగి జీవితాన్నే కోల్పోవాల్సి వస్తుంది. పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరిన్ని జాగ్రత్తలు పాటించాలి. దీపావళి పర్వదినాన్ని ఆనందంగా నిర్వహించుకునేందుకు టపాసులు కాల్చేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను చింతలపూడి సీఐ రవీంద్ర నాయక్ వివరించారు.

–రవీంద్ర నాయక్ – సీఐ ,చింతలపూడి

జాగ్రత్తలు ఇవీ..

- టపాసులు కాల్చేటప్పుడు అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.
- టపాసులు నాణ్యమైనవి ఎంచుకోవాలి. లైసెన్స్ ఉన్న షాపుల్లోనే కొనాలి.
- వాహనాలపై కవర్లు వేసి ఉంచాలి. వీలైనంత వరకు ఇంటి లోపల వాహనాలను భద్రపరుచుకోవాలి.
- పిల్లలు, పెద్దలు కాటన్ దుస్తులు ధరించి టపాసులు కాలిస్తే మంచిది. నిప్పురవ్వలు పడి దుస్తులకు అంటుకునే సమయాల్లో రగ్గులు, దుప్పట్లు కప్పి మంటలను అదుపు చేయాలి.
- బిగుతుగా ఉండే ఫ్యాంట్, షర్ట్ వేసుకోవడం వల్ల పిల్లలు టపాసులు కాల్చడం తేలికవుతుంది.
- ఫస్ట్ ఎయిడ్ బాక్స్ సిద్ధంగా ఉంచుకోవాలి. ప్రాథమిక వైద్యంతో ఉపశమనం కలగకపోతే వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలి.
- పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు దగ్గర ఉండడం శ్రేయస్కరం.
- టపాసులు కాల్చేటప్పుడు, కాల్చిన తరువాత చేతులను నోట్లో, కళ్లల్లో పెట్టుకోకుండా చూడండి. పెద్ద పెద్ద బాంబులు కాల్చేటప్పుడు పిల్లల చెవుల్లో దూది పెట్టాలి.
- భూ చక్రాలను కాల్చేటప్పుడు పాదరక్షలు ధరించాలి.
- జనం లేని సమయాల్లో మాత్రమే థౌజండ్‌వాల, 10 థౌజండ్‌వాలాలను దూరంగా పెట్టి కాల్చాలి.
- పెద్దపెద్ద టపాసులు కాల్చే ముందు వాటి ప్యాక్‌లపై ముద్రించి ఉన్న జాగ్రత్తలను పాటించాలి.
- వెలిగి పేలకుండా ఆరిపోయిన చిచ్చుబుడ్లు, బాంబుల వద్దకెళ్లి పరిశీలించడం, మళ్లీ వెలిగించడానికి ప్రయత్నించడం అత్యంత ప్రమాదకరం.

ధరలు ఇలా..

వివిధ రకాల దీపావళి సామగ్రి ధరలు ఇలా:

తాటాకు టపాసులు కట్ట	రూ.50
చిచ్చుబుడ్లు చిన్నవి ప్యాకెట్	రూ.70
చిచ్చుబుడ్లు పెద్దవి ప్యాకెట్	రూ.250
సీమ టపాసులు సైజును బట్టి	రూ.20, రూ.30, రూ.60
కాకరపువ్వొత్తులు ప్యాకెట్	రూ.10, రూ.30
విష్ణు చక్రాలు సైజును బట్టి ప్యాకెట్	రూ.80 నుంచి రూ.300
భూ చక్రాలు సైజును బట్టి ప్యాకెట్	రూ.80 నుంచి రూ.300
తాళ్లు ప్యాకెట్	రూ.20
మతాబులు సైజును బట్టి కేజీ	రూ.100, రూ.200, రూ.300
హండ్రడ్ వాలా	రూ .100
థౌజండ్ వాలా	రూ. 400
10 థౌజండ్ వాలా	రూ. 3000

హాస్టల్ మరమ్మతులకు ప్రతిపాదనలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహం మరమ్మతులకు రూ.17 లక్షల అంచనాతో ఏపీఈడబ్ల్యూడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆర్‌వీ నాగరాణి తెలిపారు. ప్రస్తుతం ఈ భవనంలో మొత్తం 9 గదులు, 10 మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. కొత్త టంకు పెట్టిలకు ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు.

బాలిక అదృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు లక్కవరం ఎస్సై రామకృష్ణ తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలంలో ఓ బాలిక గత నెల 29న కనిపించకుండా పోవడంతో ఆమె తల్లి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై వివరించారు.

నవంబర్‌లో పశుగణన

పోలవరం రూరల్: పోలవరం మండలంలో పశుగణన సర్వే నవంబర్ నెలలో నిర్వహించనున్నట్టు పోలవరం పశుసంవర్ధక శాఖ ఏడీ సీహెచ్ మంజుల తెలిపారు. 22 ఎన్యుమరేటర్‌ల ద్వారా ఇంటింటికీ వెళ్లి పశువుల వివరాలను సేకరిస్తామని, దీనిపై ఇద్దరు సూపర్‌వైజర్లు పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పోలవరం సబ్ డివిజన్ పరిధిలోని పోలవరం, బుట్టాయగూడెం ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ నిర్వహిస్తామని వివరించారు.

జూదరుల అరెస్ట్



వడ్లపల్లిలో జూదరులను అదుపులో తీసుకున్న పోలీసులు

కామవరపుకోట: పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు మంగళవారం తెలిపారు. మండలంలో వడ్లపల్లి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో తొమ్మిది మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.58,450 నగదు, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసున్నట్టు చెప్పారు. ఎవరైనా కోడిపందాలు పేకాటలు నిర్వహిస్తే డయల్ 112 నెంబర్‌కు లేదా ఫోన్ నెంబర్ 94407 96678కు సమాచారం అందించాలని కోరారు.

రాముడుకుంట చెరువు ప్రాంతంలో..

జంగారెడ్డిగూడెం: స్థానిక రాముడుకుంట చెరువు ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. రూ.22 వేలు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన పి.రేవతి కుమారి మంగళవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. తొలుత ఆమె కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ అధికారులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

31న ద్వితీయ శోభాయాత్ర

కొయ్యలగూడెం: స్థానిక త్రిశక్తి పీఠం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారి ద్వితీయ శోభాయాత్ర 31వ తేదీ నిర్వహించనున్నట్టు సభ్యులు కొల్లూరు శ్రీనివాస్ తెలిపారు. దీపావళి సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం, ఉదయం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, 108 స్వర్ణ పుష్పాలతో అర్చన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మహిళలకు రక్షణ కరువైంది

జంగారెడ్డిగూడెం: దేశంలో మహిళలకు రక్షణ కరువైందని ఐఎఫ్‌టీయూ పట్టణ నాయకులు ఎం.శ్రీనివాస్ విమర్శించారు. ఐఎఫ్‌టీయు జాతీయ కమిటీ పిలుపులో భాగంగా స్థానిక మార్కెట్ యార్డ్‌లో ముప్పిడి అబ్బులు అధ్యక్షతన నిరసన సభ మంగళవారం నిర్వహించారు. పని ప్రదేశాలలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని శ్రీనివాస్ ఆరోపించారు. మహిళల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గంపల వెంకటేశు. ముప్పిడి అబ్బులు. పాడిదోలు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు

అగ్నిప్రమాద నిరోధక సామగ్రి సిద్ధంగా ఉండాలి

డీఎస్పీ వెంకటేశ్వరరావు

పోలవరం రూరల్: బాణసంచా దుకాణం వద్ద అగ్నిప్రమాద నిరోధక సామగ్రిని సిద్ధం చేసుకోవాలని వ్యాపారులకు డీఎస్పీ ఎం వెంకటేశ్వరరావు సూచించారు. ఆయన పోలవరం గ్రామంలోని దీపావళి దుకాణాలు ఏర్పాటుచేసే ప్రదేశాలను పరిశీలించారు. నీరు, ఇసుక తదితర వస్తువులను దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలని, దుకాణాలను దూరంగా ఏర్పాటు చేయాలని అన్నారు. లైసెన్సులు ఉన్న వారుమాత్రమే దుకాణాలు ఏర్పాటు చేయాలని, లైసెన్సులు లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోదావరి ర్యాంపు పరిశీలన

కార్తీకమాసం ప్రారంభమవుతున్న సందర్భంగా పోలవరంలో గోదావరి ర్యాంపులను డీఎస్పీ వెంకటేశ్వరరావు పరిశీలించారు. నదిలో లోతు ఎక్కువ ఉంటే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీఐ ఆర్ సురేష్‌బాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఉన్నారు.

బాణసంచా దుకాణాల తనిఖీ

కొయ్యలగూడెం: దీపావళి నేపథ్యంలో బాణసంచాల దుకాణాలను ఎస్సై వి.చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. దుకాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమతి పత్రాలను పరిశీలించారు. కొయ్యలగూడెం మండలంలో 16 దుకాణాలకు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు అనుమతులు ఇచ్చినట్టు ఆర్ఐ మణి దివ్య తెలిపారు.



పోలవరంలో గోదావరి ర్యాంపును పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు



బయ్యన్నగూడెంలో బాణసంచా దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్సై చంద్రశేఖర్

జాగ్రత్తలు పాటించండి

చింతలపూడి : దీపావళి టపాసుల దుకాణాల వద్ద అన్ని జాగ్రత్తలూ పాటించాలని సీఐ రవీంద్ర నాయక్ వ్యాపారులను ఆదేశించారు. చింతలపూడి పట్టణంలో బాణసంచా విక్రయ దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. నిర్వాహకులు దుకాణాల వద్ద నీరు, ఆక్సిజన్ సిలెండర్లు, ఇసుకను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై కుటుంబరావు పాల్గొన్నారు.

ఆనందంగా గడపాలి

జంగారెడ్డిగూడెం: ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళి పండుగను నిర్వహించుకోవాలని డీఎస్పీ యు.రవిచంద్ర సూచించారు. స్థానిక అశ్వారావుపేట రోడ్డులో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను డీఎస్పీ, తహసీల్దార్ కె.స్లీవజోజి, సీఐ కృష్ణబాబు, ఎస్సై జబీర్, రెవెన్యూ సిబ్బంది మంగళవారం పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులకు డీఎస్పీ సూచించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా పోలీసు ఆంక్షలను పాటించాలని ప్రజలను కోరారు.

ఉత్సాహంగా 'సాక్షి మ్యాథ్స్-బీ'



సాక్షి మ్యాథ్స్ - బీ తొలి రౌండ్ కేటగిరీ - 4 పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రతిభ స్కూల్‌లో మంగళవారం ×సాక్షి× ×మ్యాథ్స్ - బీ్ మొదటి రౌండ్ పరీక్ష ఉత్సాహంగా జరిగింది. ఏటా ప్రతిష్ఠాత్మంగా సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పరీక్షకు విశేష స్పందన లభిస్తోంది. ప్రతిభ అకడమిక్ డైరెక్టర్ సుభాష్ రెడ్డి పర్యవేక్షణలో నాలుగు కేటగిరీలలో మ్యాథ్స్ - బి పరీక్ష నిర్వహించారు. 1, 2 తరగతులు కేటగిరీ – 1 గా, 3, 4 తరగతులు కేటగిరీ – 2గా, 5, 6 ,7 తరగతులు కేటగిరీ – 3గా, 8 9 10 తరగతులు కేటగిరీ – 4గా విభజించి పరీక్షలు నిర్వహించారు. కేటగిరీ – 1 లో 9 మంది, కేటగిరీ – 2 లో 40 మంది, కేటగిరీ – 3 లో 121 మంది, కేటగిరీ – 4లో 71 మంది విద్యార్థులు హాజరైనట్లు సుభాష్ రెడ్డి తెలిపారు. తొలి రౌండులో గెలుపొందిన విద్యార్థులు తదుపరి రౌండ్‌కు అర్హత సాధిస్తారని ప్రిన్సిపాల్ సరోజా రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సింధూషా రెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతోనే పట్టణాభివృద్ధి

చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: అధికారులు, సభ్యులు సమన్వయంతో పట్టణాన్ని అభివృద్ధికి కృషి చేయాలని చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జంగారెడ్డిగూడెం కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. వైస్ చైర్‌పర్సన్ కంచర్ల వాసవీరత్నం, నేత్ర సుబ్బలక్ష్మి, కె.రమాదేవి, కంచర్ల గీతా కుమారి, వలవల తాతాజీ, కసుమూరి లావణ్య తదితరులు మాట్లాడుతూ పట్టణంలో వీధిలైట్ల సమస్య పరిష్కరించాలని, బైనేరు వద్ద డంపింగ్ యార్డు వల్ల పక్కనే ఉన్న శివాలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫైర్‌స్టేషన్ వద్ద బైపాస్‌కు, పట్టణానికి లింకు రోడ్డు అభివృద్ధి చేయాలన్నారు. దొంతు మాధవ్ మాట్లాడుతూ గత నెలలో జరిగిన సాధారణ సమావేశాన్ని అధికారులు ఎందుకు రద్దు చేశారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అశ్వారావుపేట రోడ్డులో అక్రమ లేఅవుట్ గురించి వివరించారు. వైస్ చైర్మన్ ముప్పిడి అంజి మాట్లాడుతూ రూ.30 కోట్లు వరకు వెచ్చించి దీర్ఘకాలికంగా పట్టణంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు చేశామని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, చిత్రంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్

పట్టణాభివృద్ధికి రూ.4.79 కోట్లు

ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి విషయంలో రూ.4.79 కోట్లు వెచ్చించనున్నామని, ఇప్పటికే రూ.2 కోట్ల పనులు టెండర్లు పూర్తయ్యాయని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పట్టణంలోని డ్రెయిన్‌ల నిర్మాణం, శానిటేషన్, సుబ్బంపేట రోడ్డు నిర్మాణానికి వెచ్చిస్తామని తెలిపారు. తాగునీటి సమస్యను తీర్చేలా ఏఐఐబీ నుంచి డ్రింకింగ్ వాటర్‌కు మంజూరైన రూ.83 కోట్లు వెచ్చించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, కమిషనర్ కేవీ రమణ, టీపీఎస్ షేక్ చాందిని, ఏఈ పి.జోలా దీప్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, విద్యుత్ ఏఈ సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల సమగ్ర పరిశీలన

కామవరపుకోట: ఆయిల్‌పామ్ తోటల్లో వచ్చు తెగుళ్ల నివారణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ శాస్త్రవేత్త జి.రవిచంద్రన్ అన్నారు. మంగళవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ జాతీయ పరిశోధనా స్థానం పెదవేగి శాస్త్రవేత్తల బృందం, మండల ఉద్యాన అధికారి జి.లక్ష్మి, గోద్రెజ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ ఎ.రాజు కలిసి మండలంలోని తడికలపూడికి చెందిన రైతులు బొంతు వెంకటేశ్వరరావు, తూతా లక్ష్మణరావు ఆయిల్ ఫామ్ తోటలను సమగ్ర పరిశీలన చేశారు. అనంతరం ఆయిల్‌పామ్ రైతులతో సమావేశం నిర్వహించారు. శాస్త్రవేత్తలు జి.రవిచంద్రన్, కె.మనోరమ, ఎ.సుబ్బన్న, పి.అనిత మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ తోటల్లో వచ్చే గానోడెర్మా, కాండం తడికుళ్లు, మొవ్వ కుళ్లు తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ ఉద్యాన సహాయకులు, గోద్రెజ్ కంపెనీ ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ తోటలో తెగుళ్ల నివారణకు సూచనలిస్తున్న ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలు

యాజమాన్య పద్ధతులతో ఖర్చు ఆదా

టి.నరసాపురం: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఖర్చులు తగ్గించి ఆదాయాన్ని పెంచుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ సూచించారు. టి.నరసాపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ బి.సుమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాగకుమార్ మాట్లాడుతూ రైతులు రసాయనిక పురుగుమందులు వినియోగం బదులుగా ప్రకృతిలో లభించే తూటికాడలతో తూటి కాడ కషాయాన్ని తయారుచేసి దోమపోటును నివారించవచ్చని వివరించారు. పశుసంవర్ధక శాఖ అధికారి కె.కోటేశ్వరరావు రైతులకు అందించే వివిధ పథకాలను వివరించారు. అనంతరం వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. సర్పంచ్ ఎం సునంద, ఎంపీటీసీ ఎస్ వెంకట్రావు, కొల్లి రమేష్, కొండపల్లి రవి, కొరివి శ్రీకాంత్, పండూరి పోతురాజు, రైతు సేవా కేంద్రం సిబ్బంది కె.నరేంద్ర, జి.అనూష తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

కొయ్యలగూడెం: గవరవరం, రాజవరం పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం వ్యవసాయ అధికారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సీడ్ మొక్కజొన్నలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏరువాక కేంద్రం, ఏలూరు శాస్త్రవేత్త ఎన్ నాగేంద్ర బాబు రైతుల సందేహాలను నివృతి చేశారు. వరిలో దోమ, కాండం తొలిచే పురుగు, బాక్టీరియా ఆకు ఎండు తెగులు, అగ్గి తెగులు, మొక్క జొన్నలో పాము పొడ తెగులు, టర్సికం ఆకు, ఎండు తెగులు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ అధికారి పి.ధీరజ్ లక్ష్మణ్ ఆయిల్ పామ్ పంటలో యాజమాన్య పద్ధతులను వివరించారు. హబ్ మేనేజర్ బి.సోమశేఖర్ వివిధ పంటలో పోషక యజమాన్యంపై మాట్లాడారు.



టి.నరసాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

గొంతేనమ్మ ఊరేగింపు

లింగపాలెం: మండలంలోని వేములపల్లి గ్రామంలో గొంతేనమ్మ తల్లి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం తీన్మార్ డప్పులతో డీజే బాక్స్‌లతో గొంతేనమ్మ వారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యూత్, చిన్నారులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు.



గొంతేనమ్మ తల్లిని ఊరేగిస్తున్న దృశ్యం

విద్యార్థినికి అభినందనలు

చింతలపూడి: 13 సంవత్సరాలు తరువాత చింతలపూడి నియోజకవర్గం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని తహసీల్దార్ ప్రమద్వర అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, చింతలపూడి సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వి.భార్గవి అండర్-19 రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్‌లో పాల్గొని సిల్వర్ మెడల్ గెలిచి, జార్ఖండ్ (రాంచి)లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని, మండల విద్యార్థిని జాతీయ స్థాయిలో సెలెక్ట్ అవ్వడం గర్వంగా ఉందని తహసీల్దార్ అన్నారు. హోంగార్డు ఉద్యోగం చేస్తూ విద్యార్థినులకు వివిధ క్రీడలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్న కోచ్ సూరిబాబుకి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హెచ్ శ్రీనివాస్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



భార్గవిని అభినందిస్తున్న దృశ్యం

కమిషనర్ దృష్టికి జగన్నాథపురం పేర్ల తొలగింపు వ్యవహారం

వేలేరుపాడు: వేలేరుపాడు మండలం జగన్నాథపురం గ్రామంలో 140 ఇళ్లకు సంబంధించి స్ట్రక్చర్ వాల్యూస్ (ఇంటి విలువల పరిహారం)ను అవార్డులో తొలగించిన విషయాన్ని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆర్అండ్ఆర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం విజయవాడలోని పోలవరం ఆర్అండ్ఆర్ కమిషనర్ రాంసుందర్ రెడ్డిని ఎమ్మెల్యే కలిశారు. జనసేన, బీజేపీ, సీపీఐ, సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా నాయకులు పాల్గొన్నారు.